జీవీఎంసీ మేయర్ పై అవిశ్వాస తీర్మానానికి కూటమి సన్నద్ధం

కలెక్టర్ కు అవిశ్వాస లేఖ అందజేత

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : రాష్ట్రంలో కూటమి సారధ్యంలో అనేక మున్సిపల్ కార్పొరేషన్ల చైర్మన్లు, మేయర్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టి కూటమి పరం చేసుకునేందుకు ప్రయత్నాల్లో భాగంగా రాష్ట్రంలోని అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ గా ఉన్న జీవీఎంసీ గ్రేటర్ మేయర్ పీఠాన్ని వైసీపీ నుండి కూటమి దక్కించుకోవాలన్న సంకల్పంలో భాగంగా శనివారం పలువురు కార్పొరేటర్లు కలిసి ఎమ్మెల్యేలు విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ కు లేఖను అందజేశారు. ఇటీవల వైసీపీకి చెందిన కొంతమంది కార్పొరేటర్లు టిడిపి నేత నారా లోకేష్ సమక్షంలో చేరిన సంగతి తెలిసిందే. జీవీఎంసీ మేయర్ పై అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ కి అందజేసిన వారిలో ఎమ్మెల్యే లు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, విఎంఆర్డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ను కలిసి జీవీఎంసీ మేయర్ పై అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇచ్చామని, అవిశ్వాసాన్ని మేము నెగ్గుతామని ధీమా వ్యక్తం చేశారు. జీవీఎంసీ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంటుందని, సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అధికారం కోసం తాము అవిశ్వాస తీర్మానానికి వెళ్లడం లేదని, జీవీఎంసీ లో జరిగిన అవినీతి, అన్యాయాన్ని అరికట్టడానికి అవిశ్వాస తీర్మానం పెట్టామన్నారు. విశాఖ లో అభివృద్ధి పనులు చేయడానికి అవిశ్వాస తీర్మానం పెట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి పరిపాలన ఉండకూడదని కూటమి కి ప్రజలు అద్భుతమైన మెజారిటీ ఇచ్చారన్నారు. వైసీపీ నాయకులు ఇంకా పదవులు విడిచిపెట్టలేదు కాబట్టే అవిశ్వాస తీర్మానం పెట్టామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి పై చట్టం ప్రకారం ముందుకు వెళ్తామన్నారు. ప్రజలు కోరుకున్నదే ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతుందన్నారు.

కేజీబీవీను సందర్శించిన రాష్ట్ర సెక్రెటరీ దేవానంద రెడ్డి

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం నేలతేరు కస్తూరిబా గాంధీ పాఠశాలను రాష్ట్ర సెక్రెటరీ డి దేవానంద రెడ్డి శనివారం సందర్శించారు అందులో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు, పదో తరగతి బయాలజీ 25 నిమిషాలు పాటు విద్యార్థులను చదివించి, రాయడం ద్వారా విద్యార్థులు కొన్ని విషయాలు అలవర్చు కోవచ్చని తెలిపారు. అనంతరం స్టాప్ మీటింగ్ నిర్వహించి సమీక్ష చేసి విద్యార్థులకు పలు సూచనలు అందించి అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ స్టాప్ పాల్గొన్నారు.

ఏపీ ఐసెట్ నోటిఫికేషన్ విడుదల

ఏప్రిల్ 9 వరకు దరఖాస్తు గడువు

విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ-ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఐసెట్ 2025 నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కన్వీనర్ ఆచార్య ఎం.శశి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 09 వరకు ఆన్లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తారు. రూ 1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 10 నుంచి 14 వ తేదీ వరకు, రూ 2000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 15 నా నుంచి 19 తేదీ వరకు, రూ 4 వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 20 నుంచి 24 వ తేదీ వరకు, పదివేల రూపాయల అపరాధ రుసుముతో ఏప్రిల్ 25 నుంచి 28 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తుల్లో ఎటువంటి తప్పులు దొర్లినా వాటిని సరి చేసుకోవడానికి ఏప్రిల్ 29-30 తేదీల్లో విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. విద్యార్థులు హాల్ టికెట్లను మే 2 వ తేదీ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. మే 7 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పరీక్షను నిర్వహిస్తారు. విద్యార్థులు సత్వరం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం https://cets. apsche.ap.gov.in/ APSCHE/APSCHE Home.aspx వెబ్సైట్ ను సంప్రదించాలని కోరారు.

వేద విజ్ఞానాన్ని అందరికీ అందించడమే ధ్యేయం

వేద విద్యలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

వేద వేదాంత గురుకుల మహావిద్యాలయం

ధర్మాధికారి ఆచార్య శేషాద్రి

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఆధునిక సమాజంలో వేద విజ్ఞానాన్ని అందరికీ చేరువ చేయడమే ధ్యేయంగా వేద వేదాంత గురుకుల మహావిద్యాలయం లక్ష్యం అని విద్యాలయం ధర్మాధికారి ఆచార్య డివిఆర్ శేషాద్రి అన్నారు. శనివారం నగరంలోని దస్పల్ల హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శృంగేరి శారదా పీఠం వారి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా, మాదిపాడు గ్రామంలో 'వేద వేదాంత గురుకుల మహావిద్యాలయం' ను ఏర్పాటు చేయడమైందని తెలియజేశారు. విద్యాలయం కృష్ణానది తీరంలో 51 ఎకరాల సువిశాల ప్రాంగణంలో నిర్మితమైం దన్నారు. ఇందులో ప్రవేశం పొందిన విద్యార్థులకు వసతి, ఆహారం, విద్యాసదుపాయాలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నా మన్నారు. ప్రతి ఏడాది 200 మంది విద్యార్థులను కొత్తగా చేర్చుకుంటున్నామని తెలియజేశారు. 7 నుంచి 12 ఏళ్ల వయసు ఉన్నవారు ఈ విద్యాలయంలో ప్రవేశం పొందవచ్చు అన్నారు. ఇందులో 12 ఏళ్ల పాటు పూర్తి శిక్షణ పొందిన వారు ఘనా పాటీలు అవుతా రన్నారు. ఉచిత వేద విద్యను అందించటం తో పాటు శిక్షణ సమయంలో ప్రతి విద్యార్థికి నెలకి రూ. 2500లు స్టైఫండ్ అందజేయడం జరుగు తుందన్నారు. శిక్షణలో 1.కృష్ణ యజుర్వేదం-తైత్తరీయ శాఖ, 2.శుక్ల యజుర్వేదం-కాన్వశాఖ, 3.ఋగ్వేదం-షాకల శాఖవంటి వేదాలను పూర్తిస్థాయి లో బోధిస్తారని తెలియజేశారు. విద్యార్థులకు ధార్మిక విలువలతో కూడిన ఆధునిక విద్యను అందించడంతో పాటు ప్రపంచస్థాయిలో అవకా శాలను అందించేందుకు అవసరమైన మెలకువలను అందిస్తామన్నారు. గ్రామీణ, గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు పాఠశాలలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వేద విద్యను అభ్యసించ దలచినవారు 9963057025 నంబర్కు వాట్సఅప్ సందేశం పంపి పూర్తి వివరాలు పొందవచ్చు అన్నారు అన్నారు.

24, 25 తేదీలలో జోన్-8 పరిసర ప్రాంతాలకు తాగునీటికి అంతరాయం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-8 పరిధిలో వివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైను మరమ్మత్తులు చేయు నిమిత్తం మార్చి 24, 25 తేదీలలో జోన్ 8 లో పలు ప్రాంతాలలోని ప్రజలకు తాగునీటికి అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఎమ్ఎన్ హరేంధిర ప్రసాద్ తరుపున నీటి సరఫరా విభాగం కార్య నిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. రాయపూర్ నుండి సబ్బవరం నేషనల్ హైవే పై నిర్మాణ పనులు జరుగుతున్న సందర్భంగా జీవీఎంసీ ప్రధాన వనరులైన తాటిపూడి మంచినీటి సరఫరా చేయు పథకం 900 ఎమ్ ఎమ్ వ్యాసం గల బి డబ్ల్యు ఎస్ సి ప్రధాన పైపులైను ఉత్తరాపల్లి, మునిడివల్లి, పాత పెందుర్తి మొదలైన చోట్ల మరమ్మతులు చేయు నిమిత్తం తేదీ 24.03.2025 (సోమవారం)మరియు 25.03.2025 (మంగళవారం) తేదీలలో మంచినీటి సరఫరా పూర్తిగా నిలిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.తాటిపూడి ప్రధాన పైప్ లైన్ పైన ఉన్న బల్క్ (రెసిడెన్షియల్)/ఇండస్ట్రీస్) నీటి వినియోగదారులుకు మరియు జోన్-8 పరిధిలో ఉన్న వార్డ్-93(పి) నుంచి వార్డ్-98లో ఉన్న సాయి దుర్గానగర్, దుర్గా నగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయినగర్, బంట కాలనీ, రవి నగర్, లక్ష్మీపురం, పోర్ట్ కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్బీ కాలనీ, గోకుల్దాంకాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసి కాలనీ, సుజాతనగర్, పాపయ్య రాజుపాలెం,పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీ హెచ్.ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడివివరం, ఎస్సీ కాలనీ, పాత అడివివరం, అడివివరం మొదలగు ప్రాంతములలో మంచి నీటి సరఫరాకు మార్చి 24, 25 తేదీలలో అంతరాయము ఏర్పడుతుందని తెలియజేశారు. పైన తెలుపబడిన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా జరుపబడునని కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు. కావున ప్రజలకు తాగునీటి సరఫరాలో కలుగు అసౌకర్యానికి చింతిస్తూ మంచినీటి సరఫరా విభాగము, జీ.వి.ఎం.సి జోన్-8 పరిధిలో నగర ప్రజలు సహకరించవలసినదిగా కమీషనరు వారి తరపున కార్య నిర్వాహక ఇంజనీర్ కోరారు.

శిల్పారామం జాతర ఎటీ విశ్వనాథ్ రెడ్డి దంపతులకు చిరు సత్కారం

విశాలాంధ్ర-కొమ్మాది: విశాఖపట్నం జిల్లా మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి అమ్మవారి కమిటీ సభ్యులు శిల్పారామం ఎఓ టి.విశ్వనాథరెడ్డి, శోభారాణి దంపతులను శనివారం ఘనంగా సత్కరించారు, గత ఏడు సంవత్సరాలగా శిల్పారామం ఎఓ పనిచేసిన విశ్వనాథ్ రెడ్డిని ఇటీవల పులివెందులకు బదిలీ చేశారు. ఆయన పులివెందుల బయలు దేరుతున్న సందర్భంగా శ్రీదుర్గాలమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, హరిచరణ్ తదితరులు వారికి ఆశీర్వాదం చేసి తీర్ధ ప్రసాదాలు అందజేశారు, ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీదుర్గాలమ్మ ఆలయ ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిల్లా సూరిబాబు, ఉపాధ్యక్షులు పి.వి.జి.అప్పారావు, సెక్రటరీ నాగోతి తాతారావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పిల్లా మోహన్ శివకృష్ణ, కమిటీ సభ్యులు పిల్లా వెంకటరమణ, పొట్నూరి హరికృష్ణ, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పీస రామారావు, ముఖ్య సభ్యులు పిల్లా పోతరాజు, పిల్లా అప్పన్న, పోతిన రాంబాబు, డి.అప్పారావు, మధురవాడ పాత్రికేయులు ఎ.సాంబశివరావు, బి.ఆనంద్ తదితరులు ఉన్నారుజ ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ విశ్వనాథ్ రెడ్డి మధురవాడ శిల్పారామం ఎఓ వచ్చిన నాటి నుండి నేటి వరకు ఎంతో అభివృద్ధి పథంలో నడిపించారని, శిల్పారామంకి ఈశాన్య భాగంలో శ్రీ దుర్గాలమ్మ ఆలయం ఉండడం వలన ఆలయానికి ఆయన అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించారని కొనియాడారు.

పి ఫోర్ సర్వేతో దిగువ స్థాయి కుటుంబాలను ఎంపిక

విశాలాంధ్ర-సాగర్నగర్: జీవీఎంసీ 8వ వార్డు పరిధి లో సాగర్ నగర్ సచివాలయాలు అడ్మిన్లు మరియు సిబ్బంది నెల రోజులుగా పి ఫోర్ సర్వే నిర్వహించి అట్టడుగు దిగువ స్థాయి పేద కుటుంబాలను ఎంపిక చేయడం జరిగింది ఈ ఎంపిక చేసిన పేద వర్గాల వారి లిస్టును సాగర్నగర్ లో సచివాలయంలో గ్రామసభను ఏర్పాటుచేసి ఈ విషయాలను ప్రజలకు తెలియజేసే నిమిత్తం నాయకులను గ్రామ పెద్దలను ఆహ్వానించి సమావేశం నిర్వహించడమైనది ఈ సమావేశంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు టిడిపి వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి జనసేన పార్టీ అధ్యక్షుడు శాఖరి శ్రీనివాసరావు వార్డు ప్రధాన కార్యదర్శి బోడెపూడి దొరబాబు మహిళా ప్రతినిధి శతపతి మంగాదేవి ఉప్పులూరు గోపి ఒమ్మి బాబురావు దువ్వి పరమేశ్వరరావు వార్డు సచివాల అడ్మిన్లు వెల్ఫేర్ సెక్రటరీలు యూ సి డి సి ఓ మరియు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గీతం వైద్య పట్టభద్రుల దినోత్సవం

305 మందికి వైద్య డిగ్రీల ప్రదానం

విశాలాంధ్ర-మధురవాద: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) మరియు గీతం దంత వైద్య కళాశాల నుంచి వైద్య విద్యను పూర్తి చేసుకున్న 305 మంది విద్యార్థులకు పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 132 మంది విద్యార్థులకు ఎమ్బిబిఎస్ డిగ్రీలను, 122 మంది విద్యార్థులకు బిడిఎస్ డిగ్రీలను 51 మంది విద్యార్థులు ఎమ్డి డిగ్రీలను అందు కున్నారు. కార్యక్రమానికి ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి (ఐసిఎమ్ఆర్) మాజీ డైరక్టర్ జనరల్ ప్రొఫెసర్ బలరామ్ భార్గవ ముఖ్యఅతిధిగా హజరయ్యారు. భారతీయ వైద్య నిపుణులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని అలాగే దేశంలో తయారైన 60 శాతం ఔషధాలు, టీకాలు 100 కు పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని పేర్కొన్నారు. భారతీయ వైద్య రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ఇతర దేశాల నుంచి వైద్యం నిమిత్తం భారత దేశానికి వచ్చే పర్యాటకులతో మెడికల్ టూరిజం సహితం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కృత్రిమ మేధ వంటి అదునాతన సాంకేతిక పరిజ్ఞానం ఎన్ని వచ్చినప్పటికి వైద్యుల చేతి స్పర్శ, రోగికి నమ్మకం కలిగేలా వ్యక్తిగత శ్రద్ధ కనబరచడం ఒక వైద్యుల ద్వారా మాత్రమే జరుగుతుందన్నారు. వైద్య కోసం వచ్చేవారికి పూర్తి స్వస్థత కలిగే వరకు వెన్నంటే ఉండాలని సూచించారు. విశాఖ పార్లమెంట్ సభ్యుడు, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ప్రసంగిస్తూ గ్రామీణ ప్రాంతాలలో వైద్యానికి ప్రాచుర్యం కల్పించడం ద్వారా అవకాశాలను పెంచుకోవాలన్నారు. వైద్య రంగంలో నూతన పరిజ్ఞానం అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే వైద్యుల పరిధి విస్తరిస్తుందని లేని పక్షంలో పెరుగుతున్న పోటీ ప్రపంచంలో కనుమరుగైపోవడం జరుగుతుందన్నారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యరోల్ డిసౌజా పాల్గొని గీతం ప్రగతిని వివరిస్తూ వైద్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను తెలియజేశారు. ఈ పట్టభద్రుల దినోత్సవంలో ఇద్దరు విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు తన ప్రసంగంలో జిమ్సర్ దంత వైద్య కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు. నిరంతర వైద్యవిద్య కార్యక్రమాలకు, పరిశోధ నలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిమ్సర్ ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి వైద్య వృత్తిలో విలువలను కాపాడుకుంటూ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సేవలకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రజలకు చేరువ కావడానికి అంకితభావంతో వైద్య వృత్తిని నిర్వహించడంతో పాటు పరిశోధ నాత్మకంగా నూతన చికిత్స విధానాలను అభివృద్ధి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగా ధరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం దంత వైద్య కళాశాల ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.నరసింహరావు, గీతం పాలకమండలి సభ్యులు, గీతం సలహదారు ప్రొఫెసర్ జి.సుర్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల దినోత్సవంలో భాగంగా గీతం విద్యార్థులతో విలువలతో వైద్య వృత్తిని నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

52వ వార్డులో యూజీడీ పనులు పరిశీలించిన డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్

విశాలాంధ్ర-గోపాలపట్నం: విశాఖ పశ్చిమ నియోజకవర్గం 52వ వార్డు కరాస మెయిన్ రోడ్డు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూ.జీ.డి) పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సంభందిత అధికారులతో కలసి నగర డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ ఆయా పనులను పర్యవేక్షించారు. ఈ మేరకు శనివారం వార్డులో అభివృద్ధి పనుల పర్యటన అనంతరం యుజీడీ పనులను పరిశీలించిన ఆయనపనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో మెయిన్రోడ్డులో పనుల దృశ్యా ట్రాఫిక్ కు భారీగా అంతరాయం కలుగుతున్న వేల శ్రీధర్ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు, రోడ్డు ప్రయాణికులకు అంతరాయం లేకుండా పనులు వేగవంతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో వాటర్ సప్లై ఏ.ఈ సుమన్, వర్క్ ఇన్స్ పెక్టర్ బాలకృష్ణ, సన్యాసప్పారావు, అనూప్, సాయి పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతులకై

1. 55 లక్షలు పంటగుంటలు

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

విశాలాంధ్ర-పెందుర్తి: ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతుల కోసం ఒకటి పాయింట్ 5 5 లక్షల పంట గుంటలను ప్రభుత్వం ఏకకాలంలో ఏర్పాటుచేస్తుందని వీటి ద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెంది పంటలు దిగుబడి ఘననీయంగా పెరుగుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. జాతీయ ఉపాధి నిధులతో పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలో పంట గుంటల తవ్వకం కార్యక్రమాన్ని శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ దూది విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధి కూలీలకు మట్టి తట్టలు ఎత్తిన ఎమ్మెల్యే వారిని ప్రోత్సహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని వాటిలో భాగంగా పంటకుంటలను తవ్వించి భూగర్భ జనాలు పెంపుదలకు కృషి చేస్తుందని వెల్లడించారు. పెందుర్తి నియోజకవర్గంలో మొత్తం 450 పంట కుంటలను శనివారమే ప్రారంభించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో పాటు జనసేన నాయకులు పిన్నింటి పార్వతి కిషోర్ ఆర్ఎస్ నాయుడు గొర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్టీల్ప్లాంట్ శివాలయం వార్షికోత్సవం

విశాలాంధ్ర-పెదగంట్యాడ : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బిసి గేటు ఎఫ్ఎండి దగ్గర కొలువైన శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం 59 వ వార్సికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహాశివునికి రుద్రాభిషేకలు, రుద్ర హెూమం వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అభివృద్ధి బాటలో పయనించాలని, ఉక్కు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు మెరుగు పడాలని కోరుతూ శివయ్య ను ప్రార్థించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు యేల్లేటి శ్రీనివాసరావు, ధర్మాల కనకరెడ్డి, సిహెచ్ సురేంద్ర, నడుపూరు శ్రీనివాస్, నరసింహ రాజు,కొవిరి ధనరాజు, సుధాకర్ శర్మ, చంద్రశేఖర్, నాగేశ్వర శర్మ తదితరులు వార్సికోత్సవ పూజల్లో పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు పి-4 విధానం దోహదం

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి-4 (పబ్లిక్, ప్రయివేటు, పీపుల్స్, పార్టనర్ షిప్) విధానం పేదరిక నిర్మూలనకు దోహదపడుతుందని, అధికారులు దానిపై ప్రత్యేక శ్రద్ధ వహించి లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ రైతు సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, అధికారులతో కలిసి శనివారం కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పి-4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని, అందరూ దీని ఆవశ్యకతను తెలుసుకొని భాగస్వామ్యం కావాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహించుకునే వారికి, ఔత్సాహికులకు ఈ విధానం ద్వారా తగిన సాయం అందుతుందని పేర్కొన్నారు. ఆయా వర్గాల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని యంత్రాంగం తరఫు నుంచి మరింత సాయం అందిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఔత్సాహికులను గుర్తించి దానికి తగ్గ చర్యలు చేపట్టాలని సమావేశంలో భాగంగా ఆదేశించారు. రైతులకు సకాలంలో సలహాలు అందించాలని, క్లిష్టమైన పరిస్థితుల్లో వారికి అండగా నిలవాలని చెప్పారు. మత్స్యకారులకు పూర్తిస్థాయి సహకారం అందించాలని, వారి ఉత్పత్తులను అమ్ముకునేందుకు సదుపాయం కల్పించాలని, చేపల వేటలో వినియోగించే పాత వలల సేకరణకు హార్బర్ ప్రాంతంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో భాగంగా రైతు సంఘాల ప్రతినిధులు, స్వయం సహాయ సంఘాల మహిళలు, మత్స్యకార మహిళలు, వీధి వ్యాపారాలు, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహించుకునే వారు పలు అంశాలపై సలహాలు, సూచనలు అందజేశారు. అధికారుల ద్వారా వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సమావేశంలో సీపీవో శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, సచివాలయాల కోఆర్డినేటర్ ఉషారాణి, వ్యవసాయ అధికారి అప్పలస్వామి, మత్స్యశాఖ జేడీ లక్ష్మణ రావు, పరిశ్రమల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దళిత బహుజనులనందరికీ అంబేద్కర్ భవనాన్ని అందుబాటులోకి ఉంచాం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: విద్య, ఉపాధి, వసతితో పాటు అత్యంత ప్రాధాన్యత గల లైబ్రరీ, డార్మెటరీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా భావితరాలకు అంబేద్కర్ భవనాన్ని అందుబాటులోకి తెచ్చామని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఏఎంసీ) అధ్యక్షుడు బొడ్డు కళ్యాణ్ రావు,జనరల్ సెక్రెటరీ జేవి ప్రభాకర్ తెలిపారు.అంబేద్కర్ భవనంలో జరిగిన ఓ కార్యక్రమం లో అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మా కమిటీ అంతా డా. బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలు ఆచరణలో పెట్టడానికి సాధ్యమైనంత మేరకు చిత్త శుద్ధితో నిజాయితీగా పని చేశామని, సొసైటీకి ఉన్న పరిమితులకు లోబడి అభివృద్ధి చేస్తామన్నారు. డా. అంబేద్కర్ సాంస్కృతిక విప్లవం కావాలన్నారని, ప్రత్యామ్నాయ సంస్కృతి, బౌద్ధంలో చూపించాడన్నారు. దానిని విస్తరించే పనిలో ఉన్నామన్నారు. మనం ఎంత త్యాగం చేసామనేది మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన సందర్భం అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులు విడుదల లేదు, అవి సక్రమ వినియోగం లేదు. జనాభా ప్రకారం కేంద్ర ప్రభుత్వాన్ని సబ్ ప్లాన్ చట్టం చేయమని ఎంత మొత్తుకున్నా పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అట్రాసిటీ చట్టానికి స్టేషన్ బెయిల్ ఇవ్వడం ద్వారా తూట్లు పొడిచారన్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ట్రెజరర్, ఎస్.రాజు లు తలా లక్ష రూపాయలు , ఇతర కార్యవర్గ సభ్యులు తలా 50 వేల రూపాయలు ముందుగా భవన్ కి విరాళం ఇచ్చిన తర్వాతే ఇతరుల దగ్గరికి విరాళాలకు వెళ్లడం జరిగిందన్నారు. మేము చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ ఇది దేశానికే రోల్ మోడల్ అని చెప్పి మా కార్యవర్గం అడగకుండానే ఒక లక్ష రూపాయలు విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. ఏనాడూ ఒక్క రూపాయి కూడా భవనం అభివృద్ధికి ఇవ్వనివారు ఇప్పుడు భవనాన్ని రక్షిస్తామంటూ మన జాతిని మభ్యపెట్టడం సభ్యులు గమనించాలని కోరారు.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

అమ్మవారిని దర్శించుకున్న బెహరా సంస్థల అధినేత భాస్కర్రావు

విశాలాంధ్ర-గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటా కాలనీ లో శ్రీ అభయాం జనేయ స్వామి శీ గణపతి సంయుక్త శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆల వార్షికోత్సవం సందర్భంగా శనివారం బెహరా సంస్థల అధినేత బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకున్నారు, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 91 వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, జావాన శంకర్రావు, షేక్ వల్లి, సిహెచ్ వెంకట్రావు, రాంబాబు, సింహాచలం వైసీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరంలో గ్రామసభ : పి.ఫోర్ సర్వే పై సమీక్ష

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం మండలం ,గంభీరం గ్రామ పంచాయతీలో శనివారం పీ.ఫోర్ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ వానపల్లి లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గత ఫిబ్రవరి 1 నుండి 18వరకు నిర్వహించిన సర్వే నివేదికను గ్రామసభలో గ్రామస్తుల సమక్షంలో చదివి వినిపించారు. దారిద్ర రేఖ దిగులు ఉన్న కొంతమందిని గుర్తించారు. అలాగే పలు సమస్యలపై 105 మందిని గుర్తించి వారికి గల కారణాలను తెలియపరిచారు. గ్రామములో 25% మంది అట్టడుగున ఉన్నవారిగా గుర్తించి వారినీ పీ.ఫోర్ ఆధారంగా దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామ కార్యదర్శి కె చలపతి రావు పంచాయతీలో పక్కాగా సర్వే చేయడం జరిగిందని సర్వే రిపోర్ట్ లను పై అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. సర్వేలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయడం కోసం ఈ సభ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలోని ధనిక ,పేదవారిని గుర్తించడం జరిగిందని, అంతిమ నివేదికను అప్లోడ్ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బొట్ట శ్రీను ,వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ : 2
విశాఖపట్నం
ఆదివారం 23, మార్చి, 2025

5వ జోన్ పరిధిలో బహిరంగ వేలం

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 5వ జోన్ పరిధిలోని పలు దుకాణాలు, కళ్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్లకు మార్చి 24, సోమవారం ఉదయం 11 గంటలకు 5వ జోన్ (జ్ఞానాపురం) జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జోనల్ కమిషనర్ బి.రాము తెలియజేశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ, జ్ఞానాపురం, జోన్–5, పరిధిలోని వార్డు నెం. 40 నుండి 63 వరకు ఖాళీగా ఉన్న దుకాణాలు, కళ్యాణ మండపములు, రోడ్డు సైడ్ మార్కెట్ల కు తేది 24-03-2025, (సోమవారం) ఉదయం 11.00 లకు 5వ జోనల్ కార్యాలయము, జ్ఞానాపురం నందు దిగువ తెలిపిన వివరాలు వారిగా బహిరంగ వేలము నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వార్డు నెం.60 గుల్లల పాలెం షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం. 8,22,23, 24, 48, 52, 54, 55, 56,57, 58, షాప్ లకు, మరియు వార్డు నెం 51లోని మాధవ స్వామి కళ్యాణ మండపం నకు మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు మరియు మార్కెట్స్ లలో గుల్లలపాలెం దుకాణము, రోడ్ పక్కన మార్కెట్స్ (హాకర్ మండలం), అక్కయ్యపాలెం రోడ్ సైడ్ మార్కెట్ లకు ఒక సంవత్సరం కాల పరిమితి వరకు వేలం పాట జరుగునని 5వ జోన్ జోనల్ కమిషనర్ తెలిపారు. కావున ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనేటప్పుడు వేలంపాటకు సంబంధించి ధరావత్తు మొత్తం డి.డి రూపం లోతీసుకురావాలని, ఎస్.సి రిజర్వుడు కేటగిరి వారు సంబందిత కుల ధ్రువికరణ పత్రం సమర్పించవలసి ఉంటుందని,వేలం పాటలో పాల్గొనే ప్రతి ఒక్కరు ఆధార్, పాన్ కార్డు కలిగి ఉండాలని, తదుపరి పూర్తి వివరణ కొరకు జోన్–5, జ్ఞానాపురం కార్యాలయము పని దినములలో పర్య వేక్షకుని సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

అవంతి విద్యాసంస్థలలో ప్రతిభకు పట్టం

విశాలాంధ్ర–తగరపువలస: తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీ గాంధీ ఆడిటోరియంలో జరిగిన అవంతియన్స్ గ్రాడ్యుయేషన్ అచీవర్స్ డే వేడుకలకు అవంతి విద్యాసంస్థలు అయినటువంటి (తగరపువలస, మాకవరపాలెం–నర్సీపట్నం, బసవపాలెం–భోగాపురం, గరివిడి) ఇంజనీరింగ్, మానేజ్మెంట్, ఫార్మసీ డిగ్రీ విభాగములలో ఉద్యోగ నియామక పత్రములు అలాగే పట్టభద్రులైన విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రివర్యులు గౌరవనీయులైన శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవంతి కాలేజీలో చదివి దేశ, విదేశాలలో ఉన్నత పదవులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు నా యొక్క అభినందనలు, అలాగే మీ యొక్క సహాయ, సహకారములను మీ తొటి విద్యార్థులకు అందించి వారికి కూడా మంచి అవకాశములను కల్పించాలని హితువు పలికారు. మనిషి జీవితం ఒక నది ప్రవాహం లాంటిదని, ఎన్నో మలుపులు తిరుగుతూ, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. మనిషి జీవితం కూడా అటువంటిదే అని ఉదహరించారు. మనిషికి సంతృప్తి అనేది జీవించే విధానంలో ఉంటుంది. సక్సెస్ అనేది ఒక్కసారి కష్టపడితే వచ్చేది కాదు, నిరంతరం కష్టపడితే తప్పనిసరిగా లక్ష్యం అనేది చేరుకోగలం. మనిషికి ఓర్పు సహనం అనేది చాలా ముఖ్యం, లక్ష్యము సాధించడానికి ప్రయత్నం చేయాలి పెద్ద పెద్ద లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి. మీరు మంచిస్థాయికి చేరి మీ తల్లిదండ్రులకి అలాగే సమాజానికి మీరు ఉపయోగపడేలా ఉంటారని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, వైస్‌ఛాన్సెలర్ జెఎన్‌టియు–జి.వి, విజయనగరం, మాట్లాడుతూ యువత కష్టపడి ఉద్యోగం సంపాదించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, మంచి లక్షణాలను కలిగి ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేసారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో పరిశ్రమలను స్థాపించి ఉద్యోగ, ఉపాధి అవకాశములను కల్పిస్తుందని వాటిని అంది పుచ్చుకోవాలని హితవుపలికారు. తల్లిదండ్రులు గర్వపడేలా జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని చెప్పారు. గౌరవ అతిథిగా ఎమ్.ఎస్.ఎన్.రావు, జనరల్ మేనేజర్ (హెచ్.ఆర్) దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్, మాట్లాడుతూ ప్రస్తుతము అర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అనేది ఫార్మసీ, వైద్య రంగా లలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని, అర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ పైన నైపుణ్యత సాధించాలని అభిప్రాయము వ్యక్తము చేశారు. మారు తున్న కాలానుగు ణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానముపై పరిశోధనలు చేయాల్సిన దిశగా యువత ముందడగు వేయాలన్నారు. మరో అతిథిగా శ్రీ ఓరుగంటి నరేష్ కుమార్, సీఈవో సింబోసిస్ టెక్నాలజీ, విశాఖపట్నం, మాట్లాడుతూ పారిశ్రామిక రంగము ఎంతగానో అభివృద్ధి చెందిందని యువతకు ఈ రంగములో చాలా అవకాశములు ఉన్నాయి వాటిని అందిపుచ్చుకోవాలని కోరారు. విద్యార్థులకు తమలో దాగిఉన్న వినూత్న ఆలోచనలతో అవకాశములను అందిపుచ్చు కోవాలని ఆశాభావం వ్యక్తం చేసారు. ప్రస్తుత మన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మీకోసం ఎన్నో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీవంటి పరిశ్రమలను స్థాపించి ఉపాధి అవకాశములను కల్పిస్తుందని వాటిని ప్రతి విద్యార్థి సద్వినియోగము చేసుకోవాలని కోరారు. అవంతి విద్యాసంస్థల నుండి పట్టభద్రులైన ఇంజనీరింగ్, మానేజ్మెంట్, ఫార్మసీ డిగ్రీ విభాగాలలో ఉత్తీర్ణు లైన విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు, ప్రశంసా పత్రాలు ఉద్యగ నియామక పత్రములు (ఆఫర్ లెటర్స్) ప్రధానం చేసారు. అత్యున్నత ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బంగారు, రజిత పతకాలు బహు కరించారు. ఈ కార్యక్రమములో అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎమ్. ప్రియాంక వైస్ చైర్మన్ శివ నందీశ్, మేనేజింగ్ డైరెక్టర్ ఐ. శ్రావణ్ కుమార్, ప్రిన్సిపాల్ డా. బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డా. ఎ. చంద్రశేఖర్ అవంతి నర్సీపట్నం కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.పి.వి.ఎస్.జె. మోహన్‌రావు, అవంతి రీసెర్చ్ కళాశాల ప్రిన్సిపాల్ గోవింద రావు, అవంతి గరివిడి ప్రిన్సిపాల్ జాషువా జయప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎమ్.బి.వి.రాజు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ప్లేస్మెంట్ అధికారులైన డాక్టర్ టి.శ్రీనివాసరావు, రూపు సుందర్, అధ్యాపకులు, భోదన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. 1520 మంది గ్రాడ్యుయేట్లకు పట్టాలు, ప్రశంసా పత్రాలు అలాగే 1137 మందికి ఉద్యగనియామక పత్రములను అందించారు.

ఉత్సాహంగా శాంతినికేతన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర–పెందుర్తి : జీవీఎంసీ 94 వ వార్డు నాయుడు తోట సమీపానగల శాంతినికేతన్ విద్యాలయం వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక లక్ష్మీ కల్యాణ మండపంలో పాఠశాల ప్రిన్సిపాల్ లీలా కామేశ్వరి ఆధ్వర్యంలో, డైరెక్టర్లు ప్రభాకర్, పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో మండల విద్యాశాఖ అధికారిని సువర్ణ, అప్సా రాష్ట్ర ప్రతినిధులు మురళి మనోహర్, మణికుమార్, శైలజ పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విద్యార్థుల ప్రతిభ పాఠవాలను ప్రశంసించి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. కాగా విద్యార్థులు ప్రదర్శించిన బిగు, ఒడిసి, తదితర నృత్యరూపకాలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో పాల్గొన్న వందలాదిమంది తల్లిదండ్రులు, తమ పిల్లల ప్రదర్శనలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ శాంతినికేతన్ విద్యాలయంలో విద్యాబోధన, క్రమశిక్షణతో సాగుతుందని, విద్యార్థులను అత్యంత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

నవ సమాజ నిర్మాణానికి అంతా కృషి చేయాలి

విశాలాంధ్ర–మల్కాపురం: డ్రగ్స్ రహిత నవ సమాజ నిర్మాణానికి అంతా కృషి చేయాలని విశాఖపట్టణం పోలీసు కమిషనర్ శంక బ్రత బాగ్చి అన్నారు. స్థానిక బీచ్ రోడ్డు లోని ఏయు కన్వెన్షన్ హాల్ లో శనివారం జరిగిన నవ సమాజ నిర్మాణ సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ–యువత డ్రగ్స్‌కు, సైబర్ నేరా లకు, హింసకు దూరంగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న హింసపై ఆయన సవివరంగా తెలియజేశారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ ప్రసంగిస్తూ–యువత మానసికంగా ధైర్యాన్ని కలిగి ఉండాలని, స్వయం క్రమశిక్షణతో మెలగాలని, దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించాలని, నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. సమావేశంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్

డాక్టర్ ఎస్.హరినాథ్, జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, వివిధ కళాశాలలకు చెందిన ప్రోగ్రాం అధికారులు, పెద్దసంఖ్యలో పోలీస్ అధికారులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం డ్రగ్స్‌పై జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన మరియు వక్తృత్వ పోటీలలో విజేతలకు అతిథులు ప్రశంసా పత్రాలను అందించి, అభినందించారు.

ప్రతి నీటి బొట్టు ను ఆదా చేసి భవితరాలకు అందిద్దాం

కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: సకల మానవాళికి నీరు ప్రాణదారమైనదని, విశాఖ ప్రజలందరూ ప్రతి నీటి బొట్టును ఆదా చేసి భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, నీటిని సంరక్షించాలని విశాఖ జిల్లా కలెక్టర్ మరియు జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన కలెక్టర్ ఛాంబర్ లో "ప్రపంచ జల దినోత్సవం "సందర్భంగా జీవీఎంసీ మరియు రూరల్ వాటర్ సప్లై అధికారులతో నీటి నిర్వహణపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సకల మానవాళికి తాగునీరు అవసరమని, కొన్ని వాతావరణ పరిస్థితులు వలన నీటి వనరులు తగ్గిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటకుండా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, ఆదా చర్యలు చేపట్టాలని, అధికారులకు సూచించారు. పట్టణ ప్రాంతాలలో రోడ్లు ఇండ్లు నిర్మాణాల వలన వర్షపు నీరు భూముల్లోనికి చేరడం లేదని అందువలన భూగర్భ జలాలు అట్టడుగుతున్నా యన్నారు. వాటర్ మీటర్లను అవకాశము ఉన్నంతవరకు ఎక్కువగా అమర్చాలని, దీని ద్వారా ప్రజలలో బాధ్యతాయుత నీటి నిర్వహణను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. త్రాగు నీటిని డబ్ల్యు టి పిఎస్ లలో శుద్ధి చేసి పంపడానికి ఎంతో శ్రమ, సమయం అవసరమవుతుందో ప్రజలు తెలుసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇప్పటికే తిరుమల నగర్, జే ఆర్ నగర్ ప్రాంతాలలో నివాసిత సంక్షేమ సంఘాలు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి పలు కాలనీలకుఆదర్శంగా నిలిచారన్నారు. ప్రస్తుతం అర్బన్ లో 115 ఎల్ పి సి డి మరియు రూరల్ లో 55 ఎల్ పి సి డి తాగు నీరు సప్లై అవుతుందని, దీనిని అర్బన్ లో 135 ఎల్ పి సి డి మరియు రూరల్ లో 75 ఎల్ పి సి డి లు తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. వర్షపు నీరు సముద్రంలోనికి వృధాగా పోకుండా చర్యలు చేపట్టేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, ఎన్జీవోస్ నివాస సంక్షేమ సంఘం సభ్యులు మొదలగువారు వాటర్ మేనేజ్మెంట్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పై చాలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మనకు

15వ ఆర్థిక సంఘం నిధులతో అమృత్ 2.0 పలు నీటి ప్రాజెక్టులు అమలు చేయడం జరుగుతుందని ఎకో వైజాగ్, ఎకో బ్లూ, ఎకో గ్రీన్ కు సంబంధించి కార్యక్రమాలు నగరంలో చేపట్టడం జరుగుతుందని, జీవీఎంసీ పరిధిలో 50 నీటిమడుగులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, విఎంఆర్‌డిఏ గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ కొరకు స్పాంజ్ పార్కులను అభివృద్ధి చేయడం, పారిశ్రామిక సంస్థలు సి ఎస్ ఆర్ నిధుల సహాయంతో సరస్సులు చెరువులు ఆధునికరించడం జరుగుతుందన్నారు. విశాఖ నగరానికి ఏలేరు, గోదావరి, రైవాడ, తాటిపూడి, మేఘాద్రి గెడ్డ, గోస్తాని, గంభీరం, ముడసర్లోవ తదితర జలాశయాల నుండి విశాఖ ప్రజలకు పరిశ్రమలకు నీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇటీవల కేంద్ర నీటిపారుదల మరియు విద్యుత్తు బోర్డు ఆధ్వర్యంలో జీవీఎంసీ నీటి వనరులను సమర్ధంగా వినియోగించుకోవడంలో ప్రతిభ కనపరిచినందుకు పురస్కారం కూడా అందించారని ఆయన తెలిపారు కార్యక్రమంలో జీవీఎంసీ తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీరు రాజేంద్ర కృష్ణ, రూరల్ తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీరు కె వెంకట చౌదరి, ఎన్విరాన్మెంట్ సెల్, అసైన్బిలిటీ రెసిలియన్స్ యూనిట్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులు సౌకర్యార్థం మజ్జిక, చంటి పిల్లలకు పాలు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత పంపిణీ

విశాలాంధ్ర–సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనం కు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుండి భక్తులు సింహగిరిని చేరుకోవడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి భక్తులకు కావలసిన సౌకర్యాలను పర్యవేక్షిస్తూ వారికి కావలసిన అన్ని ఏర్పాట్లపై ఉద్యోగులకు తగు సూచనలు చేస్తూ వేసవి దృష్టిలో ఉంచుకొని భక్తులకు అసౌకర్యముల కలగకుండా భక్తులకు త్రాగునీరు సదుపాయం మజ్జిగ, పంపిణీ చిన్నపిల్లల కోసం పాలు పంపిణీ ఏర్పాట్లు చేయించారు. కేశఖండన మరియు ప్రసాదాలు 100 రూపాయలు 300 రూపాయల మరియు ఉచిత క్యూ లైన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు త్వరితగతిన దర్శనాలు కలిగే విధంగా చర్యలు తీసుకున్నారు . ఆలయం ప్రసాద కౌంటర్లు గోపురం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా శానిటేషన్ పనులను పరిశీలించారు ఆలయ ఉద్యోగులు వారికి కేటాయించిన విధులలో నిమగ్నమై భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఇంచార్జ్ కార్య నిర్వహణ అధికారి కె.సుబ్బారావు సూచనల మేరకు ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను నిర్వహించారు. వీరితో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు ఏఈఓ ఆనంద్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆదర్శ్ డిగ్రీ కాలేజీ మెగా జాబ్ మేళాలో 81 మంది ఎంపిక

విశాలాంధ్ర–పెందుర్తి: పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 81 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ జాబ్‌మేళా లో నిర్మన్ ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ ఉమా మహేశ్వర రావు, ప్లేసిమెంట్ ఆఫీసర్ వేణు గోపాల్, ప్లెస్మెంట్ కోఆర్డినేటర్ ఇన్ నిర్మాన్ ఆర్గనైజేషన్ డెబిట్జ్, ధనలక్ష్మి, ఫక్సకన్ ప్రవీణ్ కుమార్, యోకోహెూమ టైర్స్ సెంటర్ మేనేజర్ శ్రవణ్ కుమార్, హ్యుందాయ్ మోబిస్, వి.ఎ.రాజు, ఎంఆర్‌ఎఫ్, చైతన్య పాల్గొని నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేశారని వెల్లడించారు. జాబ్‌మేళాలో 172మంది పాల్గొనగా డబ్ల్యుఎన్‌ఎస్ లో 12 మంది, కాన్సెంట్రిక్స్ లో 7 గురు, ఎం.ఆర్.ఎఫ్, హ్యుందాయ్ మోబిస్ లలో 15 మంది, ఫాక్సకాన్ లో 47 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. ఫాక్సకాన్ కంపెనీకి ఎంపికైన వాళ్ళకి కాల్ లెటర్స్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ టి.థియో ఫిలస్ అందచేసి ఎంపికైన వాళ్ళందరికి అభినందనలు తెలియ జేశారు. మిగిలిన కంపెనీలలో ఎంపికైన వాళ్ళకి ఏప్రిల్ మొదటి వారంలో కాల్ లెటర్స్ అందచేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ జి. కమల రాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్ రావు, ఏవో జి.రవిబాబు, డి.సింహాచలం, కె.బ్యూల మెర్సీ పాల్గొన్నారు.

ఆర్టీసీ లో కారుణ్య నియామకాలు

విశాలాంధ్ర–విశాఖ కలెక్టరేట్: ఏపీఎస్‌ఆర్టీసీలో పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు (భార్య/వారి పిల్లలకు) వివిధ గవర్నమెంట్ శాఖలలో ఏడుగురికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు . చాలా రోజుల నుండి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల విషయం ఏపీఎస్ ఆర్టీసీ యాజమాన్యం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించిన విజ్ఞాపన పత్రాల పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ యమ్. యన్. హరేందిరా ప్రసాద్ వారి ఆధ్వర్యంలో ఏడుగురికి వివిధ శాఖల్లో నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌ఆర్టీసీ, విశాఖపట్నం రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు జిల్లా కలెక్టర్ వారికి కృతజ్ఞతలు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ , డి.ఆర్.ఓ. బి.హెచ్.భవాని శంకర్, , ఏపీఎస్‌ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్, జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి. శ్రీధర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

నరవ గ్రామంలో ఇంటింటి సర్వే

విశాలాంధ్ర–పెందుర్తి: ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి పేరుతో ప్రభుత్వం చేపట్టిన పి 4 సర్వే జీవీఎంసీ 88 వ వార్డు నరవ గ్రామంలో శనివారం ఉత్సాహంగా సాగింది. స్థానిక సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి వారి ఆదాయ వనరులు ఆర్థిక స్థితిగతులు సామాజిక గణాంకాలను సేకరించారు. నరవ గ్రామంలో మొత్తం 378 కుటుంబీకుల గణాంకాలను అధికారులు సమీకరించారు. సచివాలయ సిబ్బందికి స్థానిక జనసేన నాయకులు గళ్ళ శ్రీనివాసరావు, యల్లపు శ్రీనివాసరావు సహాయ సహకారాలు అందించారు.

అక్రమ మట్టి తరలిస్తున్న జెసిబి,లారీ పట్టివేత

విశాలాంధ్ర–పద్మనాభం: పద్మనాభం పోలీస్ స్టేషన్ వారి ఇచ్చిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి వెంగమాంబ క్వారీ దగ్గరలో, కురపల్లి గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న జెసిబి మరియు ఒక లారీని సిఐ శ్రీధర్ ఆదేశాల మేరకు బీట్ సిబ్బంది పట్టుకున్నారు. తగు చర్య నిమిత్తం ఎమ్మార్వో కి తెలియపరచడమైంది. అనుమతులు లేకుండా మండలంలో ఎక్కడైనా సరే అక్రమ మట్టి, గ్రావెల్ ,ఇసుక రవాణా జరిపినట్లు సమాచారం అందిన వెంటనే వాటిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

సముద్ర కాలుష్యాన్ని అరికట్టాలి

పర్యావరణ వేత్త బోలిశెట్టి సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: ప్రపంచ నీటి ధీనోచవం సందర్భంగా నగరం లో లెసన్స్ బే కాలనీ దగ్గర ఉన్న సముద్రాన్ని శనివారం పర్యావరణ వేత్త బి సత్యనారాయణ సందర్శించారు. అక్కడ నగరం ఉన్న మురుకు నీరు సముద్రంలో కలిసిపోయి మత్యాసంపాద నాసినం కావడం పై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం నించి వచ్చే మురికి నీరు సముద్రం లో కలవడం వచ్చే కాలుష్యం అరికట్టడం లో జీవీఎంసీ విఫలమైందని అన్నారు. ఈ కలుషం వలన అంతో విలువైన మత్య సంపద మనం కూల్పోతున్నామన్నారు. ఇలాంటి చేపలు తినడం వలన ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు అని చెప్పారు. ఈ పరిస్థితికి ప్రభుత్వ అధికారుల నిర్లక్యమే అని చెప్పారు. గతం ఈ కాలుష్య సమస్యపై తను వాటర్ మన్ ఆఫ్ ఇండియా తో కలిసి కేసు కూడా వేశామని తెలియజేశారు. ఈ సమస్య పరిష్కారం కు కేవలం 10 కోట్లు ఖర్చు పెడితే సరిపోతుందని అన్నారు. ఈ కాలుష్యం వలన సుమారు 20 వేల మత్యాకారు కుటుంబాలు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు అని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కూడా గతం లో ఈ ప్రాంతం లో సందర్శన వచ్చి ఈ సమస్య పరిష్కారం అవుతుంది అని హామీ ఇచ్చారు కానీ ఇప్పటివరకు పరిష్కారం జరగలేదు అని చెప్పారు. తక్షణమే ఈ ప్రభుత్వం స్పందించి ఈ సమస్య పరిష్కారం చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు.

అందుబాటులోకి సాంసంగ్ ఏఐ ఆధారిత పిసి లు, గెలాక్సీ బుక్5 సిరీస్

విశాలాంధ్ర–విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, నేడు గెలాక్సీ బుక్5 సిరీస్ దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్నట్లు ప్రకటించింది. అత్యాధునిక పనితీరు మరియు లీనమయ్యే ఏఐ లక్షణాలతో, గెలాక్సీ బుక్5 సిరీస్ తదుపరి స్థాయి ఉత్పాదకత, సృజనాత్మకత మరియు వినోదం కోసం రూపొందించబడింది. ఏఐ ఆధారిత కంప్యూటింగ్‌ను గతంలో కంటే మరింత అందుబాటులోకి తీసుకురావడానికి, ఇంటెల్ కోర్ అల్ట్రాతో గెలాక్సీ బుక్5 సిరీస్ ఇప్పుడు రూ. 114900 నుండి ప్రారంభమవుతుంది, ఇది మునుపటి గెలాక్సీ బుక్4 సిరీస్ మోడల్‌ల కంటే రూ. 15000 తక్కువ. గెలాక్సీ బుక్5 సిరీస్‌ను కొనుగోలు చేసే కస్టమర్‌లు రూ. 10000 వరకు బ్యాంక్ క్యాష్‌బ్యాక్ మరియు గెలాక్సీ బడ్స్ 3 ప్రో ను కేవలం రూ. 7999 (రూ. 19999 అసలు ధరతో పోలిస్తే) పొందవచ్చు. ఈ పరికరాలు 24 నెలల వరకు ఎటువంటి ఖర్చు లేని ఈఎంఐ ఎంపికతో కూడా అందుబాటులో ఉన్నాయి.

సంపద పరిరక్షణకు ఐసిఐసిఐ ప్రు గిఫ్ట్ సెలెక్ట్

విశాలాంధ్ర–విశాఖపట్నం: సంపదను కాపాడుకోండి ద్రవ్యోల్బణాన్ని నిర్వహించడానికి ఐసిఐసిఐ ప్రు గిఫ్ట్ సెలెక్ట్ ఎంతగానో తోడ్పడుతుందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. నేటి అనిశ్చిత ఆర్థిక వాతావరణంలో, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని నిర్వహించడానికి, మార్కెట్ హెచ్చుతగ్గులను అధిగమించడానికి, ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి వ్యక్తులకు సహాయపడే రీతిలో అదనపు ఆదాయ ప్రవాహాన్ని నిర్ధారించడానికి ఆర్థిక ప్రణాళిక ముఖ్యమైనదిగా మారిందన్నారు. ఈ అవసరాన్ని తీర్చడానికి, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఒక ప్రత్యేకమైన దీర్ఘకాలిక పొదుపు పథకం తెచ్చింది అన్నారు. ఐసిఐసిఐ ప్రు గిఫ్ట్ సెలెక్ట్ ను తీసుకువచ్చిందన్నారు. ఇన్సూరెన్స్, సంపదను కాపాడుకుంటూ హామీ ఇవ్వబడిన ఆదాయాన్ని అందించడానికి రూపొందించబడిన పథకమిదనీ చెప్పారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర–విశాఖ కలెక్టరేట్: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలని, తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి కార్మికులను, ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను, పరిశ్రమల నిర్వాహకులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అక్కడ పని చేసే సిబ్బందికి ప్రమాదాల నుంచి తప్పించుకోవటం ఎలా అనే అంశంపై శిక్షణ ఇప్పించాలని చెప్పారు. ఆయా కంపెనీల్లో పని చేసే సిబ్బందికి, కార్మికులకు తప్పనిసరిగా భీమా పాలసీ చేయించాలని ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శనివారం ఉదయం వివిధ విభాగాల అధికారులు, పరిశ్రమల నిర్వాహకులతో కూడిన జిల్లా క్రైసిస్ మేనేజ్మెంట్ గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రాణ నష్టం లేని విధంగా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అన్ని చోట్లా ఆటోమెటిక్ అలారం మెకానిజం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, కంపెనీల యాజమాన్యాలను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రెండు కిలోమీటర్ల పరిధి వరకు ప్రమాద జోన్ గా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా పరిశ్రమల్లో పని చేసే సిబ్బందిని, చుట్టు పక్కల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్మికులకు అన్ని రకాల వసతులు కల్పించాలని, పర్యావరణ హిత విధానా లకు ప్రాధాన్యం ఇవ్వాలని కంపెనీ యాజమాన్యాలకు కలెక్టర్ సూచించారు. అన్ని చోట్లా ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీంలను నిత్యం అందుబాటులో ఉంచాలని, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవరించాలో తగిన శిక్షణ అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీల చీఫ్ ఇన్స్పెక్టర్ సురేశ్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, డీఎఫ్‌వో, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ్ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు డ్రగ్ ఫ్రీ సర్టిఫికెట్లు

విశాలాంధ్ర–పెందుర్తి: పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎ.యు కన్వెనషన్ హాల్లో డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ అవగాహన సదస్సులో ఉత్సాహంగా పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఇ. ఫ్లోరా తెలియజేశారు. ఈ సదస్సులో కమీషనర్ ఆఫ్ పోలీసు, శంక బ్రతా బాగ్చీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్ అబ్యూస్, సైబర్ క్రైమ్ ని పిపిటిల ద్వారా విద్యార్థులకు వివరించారని, 18 మంది ఆదర్శ్ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు కమీషనర్ డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ సర్టిఫికెట్లు అందజేశారని తెలిపారు. ప్రిన్సిపల్ ఎనీ ఫ్లోరా ఎన్.ఎస్.ఎస ఆఫీసర్ మంజుల, బయోలజీ లెక్చరర్ విజయ శాంతి, ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులు పాల్గొనగా విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్ అభినందించి నట్లు తెలియజేశారు.

24, 25 తేదీల్లో జీవీఎంసీ జోన్ 8 లో నీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర – పెందుర్తి : విశాఖ మహా నగరానికి ప్రధాన తాగునీటి వనరు అయిన తాటిపూడి రిజర్వాయర్ నుండి నీటిని తరలిస్తున్న పైపులు మార్చే పనులు చేపట్టడంతో ఈ నెల 24,25 తేదీలలో జీవీఎంసీ జోన్ 8 పరిసర ప్రాంతాల ప్రజలకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, జీవీఎంసీ తాగునీటి సరఫరా ముఖ్య కార్యనిర్వాహక ఇంజనీరు ఓ ప్రకటనలో తెలియజేశారు. రాయపూర్ – సబ్బవరం హైవే నిర్మాణ పనుల్లో భాగంగా ఉత్తరాపల్లి బ్యాలెన్స్ పాయింట్ వద్ద అత్యవసరంగా పైపులు మార్చాల్సి ఉందని, అలాగే పాత పెందుర్తి శివాలయం వద్ద పైపులకు మరమ్మతు పనులు చేపట్టనున్నామని ఈ కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుండి మంగళవారం సాయంత్రం నాలుగు గంటల వరకు జీవీఎంసీ 93వ వార్డు నుండి 98 వ వార్డు వరకు ఆయా ప్రాంతాల ప్రజలకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి వీలు కాదని తెలిపారు. ఆ సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని వెల్లడించారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయితీ రావాల్సిన స్టాంప్ డ్యూటీ బకాయిలు విడుదల చేయండి : సర్పంచ్‌ల ఆవేదన

విశాలాంధ్ర–ఆనందపురం : గ్రామపంచాయతీలో నిధులు లేక అభివృద్ధి చేయలేకపోతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధితో పాటు కనీసం పంచాయితీ కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైన పంచాయతీ అభివృద్ధిలకు స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేసి ఆదుకోవాలని మండలంలోని పలువురు పంచాయితీ సర్పంచులు కోరుతున్నారు. గ్రామాలలో అనేక పనులు సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని నిధులు మంజూరు చేసినట్లయితే అభివృద్ధి పనులతో పాటు పంచాయితీ కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి అవకాశం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్పందించి పంచాయతీల అభివృద్ధికి స్టాంపు డ్యూటీ నిధులు విడుదల చేయాలని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మితో పాటు పలువురు గ్రామ సర్పంచులు కోరుతున్నారు.

95 వ వార్డులో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర



విశాలాంధ్ర–పెందుర్తి : జీవీఎంసీ 95 వార్డులో శనివారం సాయంత్రం సిపిఎం ప్రజా చైతన్య యాత్ర చేపట్టింది. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆ పార్టీ నాయకులు ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు వీధి దీపాలు కాలువలు రోడ్లు ఇళ్ల కోసం స్థానికులు అనేకమంది సిపిఎం నాయకులకు వినతి పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు బి రమణి అప్పలనాయుడు ప్రసాదు పాల్గొన్నారు.